## ధాన్యం కొనుగోలు, చెల్లింపులలో సంగారెడ్డి జిల్లా రాష్ట్రంలో ప్రథం స్థానం : కలెక్టర్ శరత్

**సంగారెడ్డి బ్యూరో డిసెంబరు 4,ప్రభాతవార్త:**
వానకాలం వరికొనుగోలులో రాష్ట్రంలోనే సంగారెడ్డిజిల్లా ప్రథమస్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ ఎ.శరత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రతి గ్రామాంలో వరికొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి వరికొనుగోలు చేశామని అన్నారు. జిల్లాలో 227 కేంద్రాలు ఏర్పాటు చేసి,34,978 మంది రైతుల నుండి 1,75,964 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని,25,965 మంది రైతులకు290.57 కోట్ల రుపాయాలు వారి ఖాతాలలో జమచేయడం జరిగిందని అన్నారు.మిగిలిన రైతులకు మూడు రోజులలోగా డబ్బులు జమచేయడం జరుగుతుందని అన్నారు.రాష్ట్రంలోని 32 జిల్లాలలో ధాన్యం కొనుగోలులో అన్లైన్ నమోదు,టాబ్ ఎంట్రీ రైతులకు డబ్బులు చెల్లింపులలో సంగారెడ్డిజిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని కలెక్టర్ ఎ.శరత్ తెలిపారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రమణాగౌడ్‌ను సన్మానించిన మంత్రి హరీష్‌రావు

**శివ్వంపేట, డిసెంబర్ 4 ప్రభాతవార్త :** టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వై.రమణాగౌడ్‌ను రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి ఘనంగా సన్మానించారు. యువ నాయకులు రమణాగౌడ్‌కు మండల పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన నాటి నుండి నేటివరకు జరిగిన పార్టీ మరింత అభివృద్ధి, బలోపేతం కావడం పట్ల రమణాగౌడ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణ శక్తివంతమైన పార్టీగా టీఆర్ఎస్ అవతరించిందని, దీనిని దృష్టిలో ఉంచుకొని అందరిని కలుపుకొని పార్టీ కార్యక్రమాలను నిర్వహించాల్సిన అవసరం ఉందని అక్కడే పార్టీ ముఖ్యులకు, ప్రజాప్రతినిధులకు మంత్రి హరీష్‌రావు దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, పార్టీ రాష్ట్ర నాయకులు పబ్బా రమేష్‌గుప్త, ప్రముఖ వ్యాపారవేత్త, నాయకులు పైడి శ్రీధర్‌గుప్త ఉన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ దేవరెడ్డి

## కళలు, కళాఖండాలకు నిలయం భారతదేశం : ఎసిపి చల్లారెడ్డి

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 4, ప్రభాతవార్త:**
ఎన్నో కలలు, కళాఖండాలకు మన దేశం నిలయమని..భతరనాట్యం కథాకళి, కూచిపూడి లాంటి నాట్యాలను ప్రపంచానికి భారత దేశం అందించిదని సిద్దిపేట ఏసీపీ చల్లా దేవరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని విపంచి కళాభవన్‌లో శ్రీ లంబోదర కల్చరల్ అకాడమీ అధ్వర్యంలో ఆదివారం తెలంగాణ నృత్య వైభవం 2022 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ నాట్యాలకు ఎంతో ప్రాచుర్యం లభిస్తుందన్నారు. చిన్నారులకు నాట్యం నేర్పాలనే స ంకల్పం తల్లిదం డ్రులకు రావడం వారిని ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. చిన్నారుల్లో నాట్యం పై అసక్తిని రేకెత్తింపజేసేలా చూడడంలో తల్లి పాత్ర ఎంతో ముఖ్యమన్నారు.ఆరోగ్యమే మహాభాగ్యమని నాట్యంవల్ల శారీర వ్యాయామంతోపాటు ప్రశాంతత లభిస్తుందన్నారు. గతంలో సినిమాలు.. నాటకాలు వినోదాన్ని పంచాయని..నేడు వాటితో పాటు వివిధ రకాల నాట్యాలు వినోదాన్ని కలిగిస్తున్నాయన్నారు. అంద్ర మహాసభ ఉపాధ్యక్షురాలు, అభినయ డాన్స్ అకాడమీ చైర్మన్ డాక్టర్ రాధా మోహన్ మాట్లాడుతూ నాట్యం నేర్చుకోవడం కోసం వయస్సు ఏ మాత్రం అడ్డ రాదన్నారు. కార్యదీక్షిత, కృషి, పట్టుదల, సంకల్పం ఉంటే దేనినైనా సాధించవచ్చునని తెలిపారు. ఈనెల 28న ముంబైలో జరిగే అభినయ నృత్యోత్సవంలో సిద్దిపేట బృందానికి అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో నృత్య శిక్షకులు అశోక్, భవాని, మౌనిక, అర్గనైజర్లు శివకుమార్, మురళి, చిన్నారి కళాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడిగా కస్తూరి సతీష్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**



నియామకం పత్రాన్ని అందుకుంటున్న డాక్టర్ కస్తూరి సతీష్

పద్మశాలీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఉన్నత స్థానంలో ఉండేలా కృషి చేస్తానని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కస్తూరి సతీష్ అన్నారు. పద్మశాలి సంఘం 2022-24 సంవత్సరానికిగాను జిల్లా కేంద్రంలోని పోపా భవనంలో అదివారం నిర్వహించిన ఎన్నికల్లో రెండోసారి ఆయనను జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సతీష్‌కు ఎన్నికల అధికారి దూడ ం అగయ్య చేతుల మీదుగా నియామకం పత్రాన్ని అందుకున్నారు. అనంతరం సతీష్ మాట్లాడుతూ జిల్లా పద్మశాలి సంఘం అభివృద్ధికి మంత్రి హరీష్‌రావు సహకారంతో ప్రభుత్వ పథకాలు చేనేత కార్మికులకు అందేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు బూర మల్లేశం, మామిడాల గౌరీమోహన్, జోగు బిక్షపతి,మామిడాల సత్యానందం, తాళ్ల విట్టల్, చేర్యాల వెంకన్న, వైకుంఠం, రమేష్, ముదిగొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 4, ప్రభాతవార్త:**
అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని అదివారం జిల్లా కేంద్రంలోని టిఎన్జీవో భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు కడారి రవి పరిశీకులుగా, ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా విక్రమ్‌రెడ్డిలు ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శిగా కర్రోళ్ల వెంకటస్వామిగౌడ్, ఉపాధ్యక్షులుగా కె.ఉప్పలయ్య, రంగనాథ్, సిహెచ్.చంద్రశేఖర్, కోశాధికారిగా కల్లపల్లి కృష్ణకుమార్, సంయుక్త కార్యదర్శిగా ప్రభాకర్ కమిటీ సభ్యులుగా సామలేటీ మహేష్, నిషాన్‌గౌడ్, కనకరెడ్డి, హారిక, ప్రేమ్‌నారాయణ, అనిల్‌లను ఏక గ్రీవంగా ఎన్నికున్నారు. ముఖ్య, గౌరవ సలహాదారులుగా డి.సత్యానందం, బండారుపల్లి శ్రీనివాసులు, పన్యాల రామేశ్వర్‌రెడ్డి, ఏర్వ అశోక్, హరిబాబులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, అథ్లెటిక్స్ సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఈటల రాజేందర్‌కు ఆహ్వాన పత్రిక అందజేత



ఆహ్వాన పత్రిక అందజేసుతన్న బిజెపి నాయకులు

**హత్నూర డిసెంబరు 4,ప్రభాతవార్త:** హత్నూర మండలం మాధుర గ్రామం పరిధిలోని శ్రీదత్తాత్రేయస్వామా ఉత్సవాలలో పాల్గొన్నాల్సిందిగా హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను ఆహ్వానించినట్లు బిజెపి నాయకులు కొలాన్ రవి తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో కలిసి, ఆహ్వానపత్రిక అంజేసినట్లు రవి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌ను శాలువతో సన్మానించినట్లు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బిజెపి నాయకులు కొలాన్ రవితో పాటు సతీష్, భాస్కర్, రమేష్ తదితరులు పాల్గోన్నారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

**ములుగు, డిసెంబర్ 4 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని 132/33 కెవి తునికిబొల్లారం సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా సోమవా రం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ములుగు మండలం అంతటా విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ములుగు ఏఈ తెలిపారు.





వనదుర్గా భవాని మాతకు పూజలు చేస్తున్న అర్చకులు, అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

## దుర్గమ్మ నామస్మరణతో మార్మోగిన ఏడుపాయల

**పాపననపేట, డిసెంబరు 4, ప్రభాతవార్త:**
జగజ్జనని వనదుర్గా భవాని మాత నామస్మరణతో ఏడుపాయల క్షేత్రం ఆదివారం మార్మోగింది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఆయా ప్రాంతల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకోవడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కళకళలాడాయి. ఆలయానికి చేరుకున్న భక్తులు తమ మొక్కుబడిలో భాగంగా అమ్మవారిని తలనీలాలు సమర్పించడం, మంజీరా పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి బోనాలతో చేరుకుని ఒడిబియ్యం నిప్పం, కుంకుమార్చన పూజలు నిర్వహించడం జరిగింది. భక్తులుకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఆలయ పాలక మండలి చైర్మన్ బాలగౌడ్, సభ్యులు వెంకటేశం,మనోహర్, మహన్‌రావు, శ్రీనివాస్‌రావు, పెంటయ్య, సాయిలు, బాగారెడ్డి, యాదయ్య, ఆలయ ఇఓ సార శ్రీనివాస్‌లు ఆలయ సిబ్బంది మధుసూదన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రవి, మహేష్, యాదగిరి, నర్సింలు, వరణచారి, నాగరాజు శర్మ తదితరులు తగు సౌకర్యాలు కల్పించారు. ఆలయంలో ఆదివారం తెల్లవారు జాము ఆలయ అర్చకులు శంకర శర్మ, పార్థివ శర్మ, రాజశేఖర్ శర్మ, నాగరాజు శర్మ, రాము శర్మలు అమ్మవారికి అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారిని రంగు రంగు పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఎస్ఐ విజయ్‌కుమార్ తన సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.



మాట్లాడుతున్న చేబర్తి యాదగిరి

## పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలి

**-ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి**

**గజ్వేల్, డిసెంబర్ 4 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో నెలకొన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యారంగ, నిరుద్యోగుల సమస్య వెంటనే పరిష్కరించాలని ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పెండింగ్ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం తనవైఖరి మార్చుకోవాలని, సమాజంలో అన్ని వర్గాలకు ఉపయోగపడేవిధంగా ప్రభుత్వం ఆలోచించాలన్నారు. అన్ని స్థాయిలలో ప్రమోషన్లు, బదిలీలు వెంటనే చేపట్టి విద్యారంగాన్ని బలోపేతం చేయాలన్నారు. సిపిఎస్‌ను రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పదమూడు జిల్లాల్లో నిలిచిపోయిన స్పౌస్ బదిలీలు పరిష్కరించి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న అన్ని ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పరిపల్లి నాగభూషణం, రాష్ట్ర మహిళా కార్యదర్శి బెల్లి శ్యామల, గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు మరాఠి కృష్ణమూర్తి, మండల అధ్యక్షుడు సల్ల శ్రీనివాస్, నాయకుడు జోగు రవి తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో బిజెపి జండా ఎగరాలి

**కంది, డిసెంబరు 4, ప్రభాతవార్త:** వచ్చే ఎన్నికల్లో సంగారెడ్డి నియోజకవర్గంపై బిజెపి జండా రెపరెపలాడేలా కార్యకర్తలు సైనికుడిలా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంత్‌రెడ్డి, త్రిమెన్ కమిటి సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షులు నల్లా నరసింహారెడ్డిలు అన్నారు. ఆదివారం మండలంలోని ఎద్దుమైలారం గ్రామంలో పార్టీ అధ్యక్షులు నల్లా నరసింహారెడ్డి అధ్యక్షతన పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హనుమంత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిలు మాట్లాడుతూ పార్టీ పురోభివృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్దతులపై కార్యకర్తలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లి కన్వీనర్ పోచారం రాములు, మండల ప్రధాన కార్యదర్శులు నాయికోటి రాములు, కోర అరవింద్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కర్యాదర్శి ఉప్పు వీరన్న, మాజీ అసెంబ్లి కన్వీనర్ నర్సారెడ్డి, చేర్యాల ఎంపిటిసి సభ్యులు శేఖర్, మాజీ సర్పంచ్ శివరాజ్, బిజెవైఎం అసెంబ్లి కన్వీనర్ ప్రవీణ్, మండల నాయకులు, శక్తి కేంద్ర ఇంచార్జీలు, బూత్‌కమిటి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హనుమంతరెడ్డి



మాట్లాడుతున్న నవాత్ రాజేంద్రప్రసాద్

## వంజరి కులాన్ని ఎస్టీలో చేర్చాలి

**రాష్ట్ర వంజరి సంఘం డైరెక్టర్ నవాత్ రాజేంద్రప్రసాద్**

**రామాయంపేట, డిసెంబర్ 4, ప్రభాతవార్త :** వంజరి కులాన్ని బీసీ నుండి ఎస్టీలోకి చేర్చాలని రాష్ట్ర వంజరి సంఘం డైరెక్టర్ నవాత్ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం రామాయంపేట వంజరి సంఘంలో కార్యవర్గం, సంఘ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంజరులు గతంలో ఎస్టీ గ్రూపులో ఉండేవారని, తర్వాత బీసీలోకి మార్చడం జరిగిందన్నారు. వంజరి కులం సమాజంలో వెనుకబడి ఉన్నందున మళ్లీ బీసీ నుండి ఎస్టీలో చేర్చాలని డిమాండ్ చేశారు. సంఘంలో వెనుకబడిన కుటుంబాల వారికి రాష్ట్ర వంజరి సంఘం తరపున ఆర్థిక సాయం చేయబడుతుందని, మరియు ప్రతి సంవత్సరం పేద విద్యార్థులకు నోటుబుక్కులు అందజేయడం జరుగుతుందని, జనవరిలో కొత్త క్యాలెండర్ కూడా కలదని తెలిపారు. అంతకు ముందు సంఘం సభ్యులు అందరూ కలిసి రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలిని తీర్మాణం చేశారు. అలాగే కార్యవర్గం కాల సమయం ముగిసినందున పట్టణ వంజరి సంఘం నూతన కార్యవర్గాన్ని జనవరి 8వ తేదిన యాదగిరిగుట్టలో సమావేశం ఏర్పాటుచేసి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సరిదె వెంకటేశ్, నవాత్ మహేష్, సాంగని నాగరాజు, కానుగుంట సతీష్, కాలేరు సంపత్, పటేరు రవీందర్, పటేరు రాము, కాలేరు హరికిషన్‌తో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా గీతా జయంతి ఉత్సవాలు

**రామాయంపేట, డిసెంబర్ 4, ప్రభాతవార్త :** పట్టణంలో ఆదివారం గీతా జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఉదయం 6.30 నుండి 8.30 వరకు నగర సంకీర్తన, తదుపరి ఉదయం 10 గంటల వరకు 18 అద్యాయాలు గీతా పారాయణం, పూజారి బల్ల రాజయ్య ప్రవచనాలు, సంకీర్తణలతో భజన కార్యక్రమం, అనంతరం హారతి, తీర్థప్రసాద వితరణ జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా 29 సంవత్సరాలనుండి ప్రతిరోజు ఉదయం 7.30 నుండి 8 గంటల వరకు గీతాపారాయణం, భజన నిత్యం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కూర అంజయ్య, తొడుపునూరి చంద్రమౌళి, పల్లెర్ల రామలింగం, బల్ల రాజయ్య, తోట విఠల్, ఎ.జనార్ధన్, నాతి యాదగిరిగౌడ్, కె. పెంటయ్య, శ్రీనివాస్, మేర నర్సింలు, జి.వెంకటేశం, ఎస్. మాల్లారెడ్డి, మోతుకు లింబాద్రి, గంగం అంజయ్య, కె.విఠల్, పి.వెంకటేశం, టి.వెంకటేశం, డి. సత్యనారాయణ, రామారపు ముత్యాలు సాగర్‌తో పాటు మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.



గీతా జయంతి ఉత్సవాల దృశ్యం

## రేవంత్ నాయకత్వంలో కాంగ్రెస్‌కు మంచి రోజులు

**-డిసిసి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి**

**వర్గల్, డిసెంబర్ 4 (ప్రభాతవార్త):**
పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్‌కు మంచిరోజులు రానున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నెంటూర్ గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలను వేధించడమే లక్ష్యంగా పెట్టుకోగా చీకటి ఒప్పందాలతో కాంగ్రెస్‌ను అనగదొక్కే ప్రయత్నం చేస్తున్నట్లు విమర్శించారు. ముఖ్యంగా పెరిగిన పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల వస్తువుల ధరలు అదుపులేకుండా పోతుండగా ప్రధాని మోడి, సిఎం కెసిఆర్‌లు కార్పొరేట్‌కు కొమ్ము కాస్తుండడంతో ఈ దుస్థితి నెలకొన్నట్లు ఆరోపించారు. ఎన్నికలు రాగానే సిఎం కెసిఆర్‌కు కొత్త పథకాలు గుర్తుకురావడం, ప్రధాని నరేంద్రమోడి ఎన్నికలు జరిగే రాష్ట్రాలలో పర్యటిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోడి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ 13 రాష్ట్రాలలో కాంగ్రెస్‌కు మెజారిటీ, అధికారం ఉన్నప్పటికీ వేల కోట్లు పెట్టుబడి పెట్టి సంతలో ఎమ్మెల్యేలను కొనుగోలు ఏస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో చేపట్టిన రాహుల్ గాంధీ జూడో యాత్రకు మంచి స్పందన వచ్చిందని,



మాట్లాడుతున్న తూంకుంట నర్సారెడ్డి

రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు శ్రమించాలని చెప్పారు. అయితే రాష్ట్రంలో సిఎం కెసిఆర్, కేంద్రంలో నరేంద్రమోడిల కుట్రలను బహిర్గతం చేస్తూ కాంగ్రెస్ అధికారం చేపట్టే విధంగా ప్రజలను చైతన్యం చేయాలని వారి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని అన్నారు. ప్రధాని నరేంద్రమోడి, సిఎం కెసిఆర్‌లు రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ పోలీసులు, ఈడి, సిబిఐ తదితర వాటిని దుర్వినియోగం చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు నిమ్మ రంగారెడ్డి, మోహన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షులు సదానందరెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు రవి, ఉపసర్పంచ్ కొండల్‌గౌడ్, నేతలు అనిల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అజీజ్ ఉర్ రెహమాన్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి బాబుమోహన్

## కేంద్ర నిధులను రాష్ట్ర నిధులుగా మార్చుకున్నారు

**బిఆర్ఎస్‌పై బాబుమోహన్ విమర్శ**

**టేక్మాల్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** కేంద్ర నిధులను రాష్ట్ర నిధులుగా మార్చుకున్నారని బిఆర్ఎస్ పార్టీపై మాజీ మంత్రి పల్లే బాబుమోహన్ విమర్శించారు. ఆదివారం టేక్మాల్ మండలంలో పల్లె గోస బిజెపి భరోసా అనే కార్యక్రమంలో భాగంగా టేక్మాల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. అంతకుముందు బస్టాండ్‌లో పార్టీ పతాకాన్ని అవిష్కరించారు. పల్లెసీమలే ప్రగతికి మెట్లు అనే నినాదంతో ముందుకు సాగుతు కేంద్ర ప్రభుత్వం అనేక నిధులను రాష్ట్రాలకు విడుదల చేస్తుంటే తెలంగాణ ప్రభుత్వం ఆ నిధులను మార్చి వాడుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇచ్చే కిట్లు కూడ కేంద్రానివేనని దాని పేరు మార్చి వాడుకుంటున్నారని విమర్శించారు. వరి కొనుగోలులో కేంద్రం ప్రత్యేకంగా నిధులను కేటాహిస్తుందన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం కల్లబొల్లి కబుర్లను చెబుతుకాలం వెల్లదిస్తుందన్నారు. ఇచ్చిన హామిలను మరిచి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందన్నారు. చింతకుంట నుండి ధనూర మీదుగా టేక్మాల్ మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**మోరాయించిన బాబుమోహన్ కారు..**
పల్లెగోస బిజెపి భరోసా టేక్మాల్ కార్యక్రమంలో కాసేపు విలేకర్ల సమావేశంలో పాల్గొన్న బాబుమోహన్ అనంతరం తిరిగి వెళ్లేందుకుగాను కారు దగ్గరకు ఆయన రావడంతో స్టాట్ కాక మోరాహించింది దీంతో బాబుమోహన్ కార్యకర్తలు కలిసి ప్రచార రథంపై వెళ్లి పోయారు. కారును కార్యకర్తలు నెట్టిన కూడ స్టాట్ కాలేదు.

## ఏఐసిసి అధ్యక్షుడిని సన్మానించిన మాజీ మంత్రి



ఏఐఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేను సన్మానిస్తున్న మాజీ మంత్రి గీతారెడ్డి

**జహీరాబాద్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేను మాజీ మంత్రి, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ జెట్టి గీతారెడ్డి సన్మానించారు. ఆదివారం న్యూ ఢిల్లీలో మల్లికార్జున్ ఖర్గే నివాసానికి గీతారెడ్డి చేరుకుని శాలువాతో సత్కరించి పూల బొకేను అందచేశారు. తెలంగాణ రాష్ట్రంలోని పార్టీ పరిస్థితిపై ఇరువురు సుదర్ఘీంగా చర్చించినట్లు పార్టీ వార్గలు పేర్కొన్నాయి.

## 'యంగ్ ఇండియా బోల్'లో రాష్ట్రంలో మెదక్ జిల్లాకు ప్రథమస్థానం



యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

**మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 4ప్రభాతవార్త:** ఆల్ ఇండియా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో యువతను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో చేపట్టిన యంగ్ ఇండియా బోల్ కార్యక్రమంలో రాష్ట్రంలోనే మెదక్ జిల్లా మొదటి స్థానంలో నిలవడం జరిగింది. దానిలో భాగంగా ఆదివారం హైదరాబాద్ లోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జాతీయ ఇంచార్జి కృష్ణ అలవర్, రాష్ట్ర అధ్యక్షులు శివసేనారెడ్డిలు మెదక్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహేందర్‌రెడ్డిని అభినందిస్తూ సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టపడే వారికి కచ్చితంగా పార్టీ గుర్తింపునిస్తుందని వెల్లడించారు.

## శివ్వంపేటలో పర్యటించిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సునీతారెడ్డి

**శివ్వంపేట, డిసెంబర్ 4 ప్రభాతవార్త:** మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం జరిగిన పలు కార్యక్రమాల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డితోపాటు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాకిటి సునీతారెడ్డి కూడా పాల్గొన్నారు. మొదటగా సికింద్లాపూర్ దేవస్థానం వద్ద నర్సాపూర్ ఆత్మ కమిటీ డైరెక్టర్ బొద్దుల భిక్షపతి చిన్నారుల పుట్ట పంచెల కార్యక్రమానికి హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. అదేవిధంగా పాంబండ గ్రామంలో విష్ణువర్ధన్‌రెడ్డి నూతన గృహ ప్రవేశంలో వారు పాల్గొన్నారు. అనంతరం పలు శుభకార్యాల్లో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సునితారెడ్డిలు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదిం చారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రా గౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, మండల పార్టీ అధ్యక్షులు వై. రమణాగౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, వైస్ చైర్మన్ నాయిని వేణుగోపాల్‌రెడ్డి, పరికిబండ, దొంతి సర్పంచులు పూల అర్జున్, ఫణి శశాంక్‌శర్మ తదితరులు హాజరయ్యారు. అనంతరం దొంతి గ్రామంలో జరిగిన స్వర్గీయ రాజా సురేందర్‌రెడ్డి 12వ రోజు కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ధాన్యం కుప్పను ఢీకొన్న బైక్

**-ముగ్గురికి తీవ్ర గాయాలు..ఒకరి పరిస్థితి విషమం**

**మర్కుక్, డిసెంబర్ 4 (ప్రభాతవార్త):**
రహదారులపై రైతులు ఇష్టారీతిగా ధాన్యాన్ని ఆరబోయడంతో రాత్రి సమయంలో వాహనదారులకు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయంపై అధికారులు చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారు. మండల పరిధిలోని ఎర్రవల్లి, గంగాపూర్ గ్రామాల మార్గంలో ఆరబెట్టిన ధాన్యం కుప్పలకు రాత్రి సమయంలో గతంలోనూ రోడ్డు ప్రమాదాలకు గురై మృతిచెందిన సంఘటనలు ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడం తో అదే రీతిలో ఆదివారం రాత్రి పాములపర్తి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ఎర్రవల్లి నుండి పాములపర్తికి వెళ్తుండగా వరి ధాన్యం కుప్పలను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో హుటాహుటిన గజ్వేల్ ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. పాములపర్తి గ్రామానికి చెందిన చెక్కల హరీష్ బైక్ నడుపుతుండగా తన వెనక ఉన్న ఇద్దరు గాయాలపాలు కాగా హరీష్ పరిస్థితి విషమంగా ఉంది. ఈ విషయమై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# అధ్వానంగా ప్రధాన రహదారి

## పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు... ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రజలు

**బెజ్జంకి, డిసెంబర్ 4, ప్రభాతవార్త :** మండల పరిధిలోని బెజ్జంకి క్రాసింగ్ నుంచి మండల కేంద్రానికి అనుసంధానంగా ఉన్న డబుల్ రోడ్డు ప్రమాదాకరంగా మారి ప్రయాణాలకు ఇబ్బందిగా తయారైంది. బెజ్జంకి క్రాసింగ్ గ్రామంలోని స్మశానవాటిక సమీపంలో తరుచుగా రోడ్డు పై నీరు ప్రవహిస్తుండడంతో గుంతలు ఏర్పడి ప్రయాణం ఇబ్బందిగామారిందని ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే దాచారం గ్రామ శివారు నుంచి ముత్తన్నపేట గ్రామం వరకు గల రోడ్డుపై చిన్నపాటి గుంత ఏర్పడి రోజు రోజుకి రోడ్డు కృంగడంతో అ గుంత కాస్త పెద్దగా తయారైంది. అ గుంతలను ఎవరు పట్టించుకోకపోవడంతో రోడ్డుపై ప్రయాణించే వాహనాదారులకు గుంత కనిపించేలా స్థానికులు చెట్ల కొమ్మలనువేసి ఉంచారు. గడిచిన కాలంలో కురిసిన వర్షాల కారణంగా ముత్తన్నపేట గ్రామ కల్వర్టు సమీపంలో రోడ్డుపై ఎర్పడిన గుంతలను స్థానిక యువకులే పూడ్చారని అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ పటి ంచుకోవడం లేదని ప్రయా ణీకులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి రావాలంటే ఇదే ప్రదదాన రహదారి కావడంతో రాత్రి పగలు తేడా లేకుండా నిత్యం వందలాది మంది ఈ మార్గం గుండా ప్రయాణం చేస్తుంటారు.


ప్రమాదకరంగా మారిన గుంత

సామాన్యులతోపాటు ప్రజాప్రతిని ధులు, అధికారులు ఇదే మార్గం గుండా రాకపోకలు సాగిస్తున్న ఈ గుంతలు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రమాదకరంగా మారిన గుంతలను పూడ్చి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

# మంత్రి హరీష్‌రావు ఇచ్చిన హామీలు నీటిమూటలేనా...?

### లక్ష్మాపూర్ ఎంపీటీసీ నాగులు

**రామాయంపేట, డిసెంబర్ 4, ప్రభాతవార్త :** మంత్రి హరీష్‌రావు రామాయంపేటకు ఇచ్చిన హామీలు నీటిమూటలేనా అని మండల పరిధిలోని లక్ష్మాపూర్ ఎంపీటీసీ నాగులు విమర్శించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం రామాయంపేట ప్రజలకు చేసిన మోసం జిల్లా మంత్రివర్యులు హరీష్‌రావు, స్థానిక ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి రాష్ట్రంలో ఎక్కడ రెవెన్యూ డివిజన్ ఏర్పడిన రామాయంపేటను రెవెన్యూ డివిజన్ చేస్తామని మీడియా సాక్షిగా అఖిలపక్ష నేతలకు నిజాంపేటలో ఇచ్చినమాట వాస్తవం కాదా...? అన్నారు. రాష్ట్రంలో సుమారు 5-6 రెవెన్యూ డివిజన్లు ఏర్పడినా రామాయంపేట ప్రజల చిరకాల వాంఛ నెరవేరకపోవడం బాధాకరమైన విషయమన్నారు. ఒక రెవెన్యూ డివిజనే కాదు అప్పటి రాష్ట్ర మంత్రివర్యులు అయినటువంటి ప్రస్తుత ముఖ్యమంత్రి కేసీఆర్ రామాయంపేటలో బస్‌డిపోకు శంకుస్థాపన చేసి సుమారు 20 సంవత్సరాలు గడుస్తున్నప్పటికి అది ఒక కలగానే మిగిలిపోయిందన్నారు. అదేవిధంగా చూస్తే నర్సాపూర్ బస్‌డిపో పనులు చురుకుగా సాగుతున్నాయని, కానీ రామాయంపేట ప్రజల కష్టాలను పట్టించుకునే నాయకులు కరువయ్యారని దుయ్యబట్టారు. ఎన్నో సంవత్సరాల క్రితం రామాయంపేట తహశీల్దార్ కార్యాలయం శిథిలావస్థ స్థితిలో ఉన్నదని చెప్పగానే కొత్త బిల్డింగ్ మంజూరు ఇచ్చిన ప్రభుత్వం బిల్డింగ్ పనులు పూర్తికాక కనీసం 8 సంవత్సరాలు పడుతున్నా నేటివరకు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందన్నారు. రామాయంపేట మున్సిపాలిటీలో డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఒక సంవత్సరం నుండి దసరాకు ముహూర్తం, దీపావళికి ముహూర్తం అని ఇలా కాలం గడుపుతూ ఉన్నటువంటి ప్రభుత్వం టీఆర్ఎస్ ప్రభుత్వమని విమర్శించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం చెబుతున్నట్లు రైతులకు 24 గంటలు కరెంటు ఇస్తున్నమని మాయమాటలు చెప్పడం కాదు వాస్తవానికి గత ఎనిమిది నెలల నుండి టీఆర్ఎస్ నాయకులు గానీ మంత్రులు గానీ, ఎమ్మెల్యేలు గాని తెలంగాణ నియోజకవర్గాల్లో ఏ మండలంలోనైనా 24 గంటలు కరెంటు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఒకవేళ ఇచ్చినట్లైతే బహిరంగ చర్చకు సిద్దమా అని, ఎక్కడైనా నిరూపించగలరా అని కాంగ్రెస్ పక్షాన డిమాండ్ చేస్తున్నానన్నారు. ఎలక్షన్ ముందు మీరు ఇచ్చినటువంటి హామీ రైతు రుణమాఫీ, ఏకకాలంలో లక్ష రూపాయలలోపు రుణమాఫీ చేస్తామని మాట తప్పలేరా అన్నారు.

మూడు ఎకరాల భూమి ఇస్తామని మాట తప్పలేరా అని, మొన్నటికి మొన్న మునుగోడు ఎన్నికలముందు పోడుభూములు కలిగి ఉన్న రైతులందరికీ పట్టా సర్టిఫికేట్లు ఇస్తామని రైతులను మభ్యపెట్టి ఎన్నికలు అయిపోయాక 90 ఏళ్ళ నుండి లేదా 75 సంవత్సరాల నుండి సాగుచేస్తున్నట్లైతే మీకు సర్టిఫికేట్లు ఇస్తామని గూగుల్ మ్యాప్ చూపించి రైతులను మోసం చేయలేదా అని మండిపడ్డారు. ఇంకా రబోయే రోజుల్లో మీ మాటలని ప్రజలు నమ్మే రోజులు లేవని, వీటన్నిటిపై చర్చకు ఎక్కడైనా కాంగ్రెస్ పార్టీ పక్షాన మేము సిద్దంగా ఉన్నామని అన్నారు.


అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న పద్మా దేవేందర్‌రెడ్డి

## అయ్యప్ప ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే

**పాపన్నపేట, డిసెంబరు 4, ప్రభాతవార్త:** హరహర పుత్రుడు, అభిషేక ప్రియుడు అయప్ప స్వామి దేవాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పాపన్నపేటలో కొలువున్న అయ్యప్పస్వామి దేవాలయ తృతీయ వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక ప్రజలు నిర్వహించారు. ఆలయంలో జెండా కృష్ణ గురుస్వామి వేదమంత్రోచ్చరణల మధ్య సంమేశ్వర గురుస్వామి, మహాపడిపూజ కార్యక్రమాలు నిర్వహించగా ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి అయ్యప్ప దీక్షా పరులు ఆలయానికి చేరుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 18 కలశములతో 18 మహా పడిపూజ కార్యక్రమాలను అయ్యాప్పా దీక్షాపరులు భజనలు చేస్తూ, కీర్తనలు ఆలపించారు. పూజా కార్యక్రమాలకు చేరుకున్న భక్తులకు గడిల శేష శేనారెడ్డి గురుస్వామి భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిట అధ్యక్షులు, గ్రామ సర్పంచన గురుమూర్తి గౌడ్, కమిటి సభ్యులు సుంకరి కృష్ణ, సుంకరి సాయిలు, సత్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రాండ్ క్రిస్టమస్ వేడుకల్లో ఎమ్మెల్యే

**మనూర్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** మండలంలోని బెల్లాపూర్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన గ్రాండ్ క్రిష్టమస్ వేడుకల్లో నారాయణ ఖేడ్ శాసన సభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్కడి నుంచి అనారోగ్యంతో అవస్థలు పడుతున్న ఎంపిటిసి సభ్యులు రాజశేఖర్‌రెడ్డి తండ్రి విఠల్‌రెడ్డి ఇంటికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిని అడగి తెలుసుకున్నారు. ప్రమాదంలో క్షతగాత్రుడైన శేరి శ్రీనివాస్ రెడ్డి కుమారుడిని పరామర్శించారు. కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ అధ్యక్షులు విఠల్‌రావు, ఎంపిటిసి సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, జడ్పీటిసి తనయులు నాగేందర్, సర్పంచ్‌లు ప్రసాద్, సామేల్, పాస్టర్, క్రిస్టియన్‌లు పాల్గొన్నారు.

## నూతన పాలక వర్గానికి సన్మానం

**హుస్నాబాద్, డిసెంబరు 4, ప్రభాతవార్త :** టిటిడబ్ల్యూజెఎ(తెలంగాణ ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్) సిద్దిపేట జిల్లా నూతన అధ్యక్ష కార్యదర్శులుగా మాలోతు శ్రీనివాస్‌నాయక్, భూక్యా తిరుపతినాయక్, ప్రచార కార్యదర్శి భూక్యా రాహుల్‌నాయక్ ఇటీవల ఎన్నికకాగా విషయం తెలుసుకున్న భీమదేవరపల్లి మాజీ జడ్పిటిసి రాంచదర్‌నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం అక్కన్నపేటలో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిటిడబ్ల్యూజెఎ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా అక్కన్నపేట మండలానికి చెందిన వారు కావడం సంతషకరమన్నారు. కార్యక్రమంలో గిరిజన అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరన్ననాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జిల్లా అధ్యక్షుడు సత్యంనాయక్, లంబాడి ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నరసింహానాయక్, మోతీలాల్‌నాయక్ పాల్గొన్నారు.


షర్మిల సమక్షంలో టివైఎస్ఆర్ పార్టీలో చేరుతున్న బాపు మల్‌శెట్టి తదితరులు

# కార్యకర్తలే పార్టీకి బలం

### టివైఎస్ఆర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల

**నారాయణఖేడ్, డిసెంబర్ 4 ప్రభాతవార్త:** టిఆర్ఎస్ సీనియర్ నాయకులు, గొర్రెల, మేకల పెంపకందారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాపు మల్‌శెట్టి వై.ఎస్.ఆర్.తెలంగణ పార్టీ అధ్యక్షురాలు షర్మిల ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఆదివారం హైదరాబాద్‌లోని లోటస్ వైఎస్.ఆర్. పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షురాలు షర్మిల ఆధ్వర్యంలో బాపు మల్‌శెట్టితో పాటు తదితరులు పార్టీలో చేరారు. ఈ సందర్బంగా షర్మిల బాపు మల్‌శెట్టితోపాటు పార్టీలో చేరినవారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్బంగా పార్టీ అధ్యక్షురాలు షర్మిల మాట్లాడుతూ నారాయణఖేడ్ ప్రాంతం నుంచి వైఎస్ఆర్ పార్టీలో చేరడం ఎంతో ఆనందకర విషయమన్నారు. ఈ సందర్బంగా బాపు మల్‌శెట్టి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఎంతో చురుకైన పాత్ర పోషంచి తెరాస పార్టీకి ఎంతో సేవ చేశామని ఆయన గుర్తుచేశారు. తెరాస పార్టీలో ఉద్యమ కారులకు సరైన గుర్తింపు ఇవ్వకపోవడంతో నిరాశ చెందామని అందుకే తెరాస పార్టీకి రాజీనామా చేసి వైఎస్ఆర్ పార్టీలో చేరామని ఆయన పేర్కొన్నారు. పేదలకు ఎంతో సేవచేసి ప్రభుత్వంతో పోరాడి గొల్లకుర్మ రైతులకు గొర్రెలు, మేకలు ఇప్పించడం జరిగిందాన్నారు. పార్టీలో చేరినవారు గోవింద్‌యాదవ్ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్, మల్లారెడ్డి మాజీ సొసైటీ ఛైర్మన్ బోరంచ,శంకరప్ప మాజీ సర్పంచ్ గోందేగావ్, నిరంజప్ప గోందేగామ్ ,సంజీవరెడ్డి ర్యాకల్, రాజు టైలర్ ఉన్నారు.

# అభివృద్ధిలో తెలంగాణ అగ్రగామి

### కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి

**మేడ్చల్, డిసెంబర్ 4. ప్రభాతవార్త**

సీఎం కేసీఆర్ సారద్యంలో తెలంగాణ అన్ని విదాల అభివృద్ధి సాదించి, దేశంలోనె ఆదర్శరాష్ట్రంగా నిలిచిందని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన సీఎం సభకు ఆదివారం మంత్రి మేడ్చల్ నాయకులతో కలిసి కండ్లకోయలోని ఓఆర్ఆర్ జంక్షన్ వద్ద నుంచి బయలు దేరి వెళ్లారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు అనంతరం పేద ప్రజల సంక్షమమే ద్యేయంగా సీఎం కేసీఆర్ పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. టీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజలు ఎక్కడ చూసినా నీరాజనం పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నందారెడ్డి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, పూడూర్ సర్పంచ్ బాబు యాదవ్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, రాజమల్లారెడ్డి, నాయకులు భాస్కర్‌యాదవ్, భాగ్యారెడ్డి, రామస్వామి, మధూకర్, శ్రీకాంత్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

**మర్కుక్, డిసెంబర్ 4 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని అంగడికిష్టాపూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం ప్రాతఃకాల పూజ, మూలమంత్ర హవనములు, ఉదయం 8 గంటలకు ధాన్యాధివాసము, సాయంత్రం 5 గంటలకు ప్రదోషకాల పూజ, శయ్యాధివాసము,ఫల, పుష్పాధివాసములు, సాయం ఔపాసనము, హారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం గ్రామ దేవతలైన పోచమ్మ, మహంకాళమ్మ, మైసమ్మలకు బోనాలను నిర్వహించారు. అలాగే సోమవారం ప్రాతఃకాల పూజ, హవనము, గర్త సంస్కారము, ఉదయం 6 గంటలకు రత్న, దాతు, బీజన్యాసములు, 8.19 గంటలకు అశ్విని నక్షత్రయుక్త ధనుర్లగ్న పుష్కరాంశ సుముహూర్తాన యంత్ర ప్రతిష్ఠ, మూర్తి ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, క్షేత్ర బలి, పూర్ణాహుతి, అవబృదము, మహాదాశీర్వచనం, ఋత్విక్ సన్మానము, శ్రేయః సంపాదనము, 11.30 గంటలకు పుట్టమన్ను తేవడం, లందకు పోవడం, గంగతెప్పకు పోవడం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరవుతున్న భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ లక్ష్మీరాములుగౌడ్, గౌడ సంఘం సభ్యులు తెలిపారు.


ఎల్లమ్మ దేవాలయంలో హోమం నిర్వహిస్తున్న సర్పంచ్, గౌడ సంఘం సభ్యులు


ఉత్తమ సర్పంచ్ స్వామిగౌడ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

## ఉత్తమ సర్పంచ్ స్వామిగౌడ్‌కు సన్మానం

**కొమురవెల్లి, డిసెంబర్ 4, ప్రభాతవార్త:** గ్రేటర్ వరంగల్‌లో తెలుగు వెలుగు జాతీయ పురస్కారాల 10వ వార్షికోత్సవాల సందర్భంగా తెలుగు వెలుగు సాహితీ వేదిక వలోజు మోహన్‌రావు, తెలుగు వెలుగు సాహిత్య అధ్యక్షులు పోలోజు రాజ్‌కుమార్, ప్రభుత్వ చీప్‌విప్ ధ్యానం విజయ భాస్కర్ చేతుల మీదుగా విశిష్ట గ్రామీణ సేవా జ్యోతి ఉత్తమ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామిగౌడ్‌ను అదివారం అవార్డుతో సత క్రరించారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్ మాట్లాడుతూ తన సేవలు గుర్తించి ఉత్తమ సర్పంచ్‌గా ఎంపిక చేసినందులకు కృతజ్ఞతలు తెలిపారు. అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందని ఇదే ఉత్సహంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

## మల్లన్న సన్నిధికి భారీగా తరలివచ్చిన భక్తులు


కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

**కొమురవెల్లి, డిసెంబర్ 4, ప్రభాతవార్త :** ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఒకటైన కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి అలయానికి అదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. అదివారం సెలవు దినం కావడంతో భక్తులు తమ పిల్లాపాపలతో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే భక్తులు స్వామి వారికి అభిషేకం, నిత్యకళ్యాణోత్సవంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కొండపై ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలతో అత్యంత భక్తి శ్రద్దలతో బోనం సమర్పించారు. రాతిగీరల వద్ద ప్రదక్షణలు, కోడెల స్తంబం వద్ద కోడెలు కట్టి పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అలయ అధికారులు, పాలక మండలి తగు ఏర్పాట్లు చేశారు. నేడు బస్వాపూర్‌లో మంత్రి, ఎమ్మెల్యే చేతుల మీదుగా

## నేడు బస్వాపూర్‌లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహావిష్కరణ

**కోహెడ, డిసెంబర్ 4,ప్రభాతవార్త :** మండల పరిధిలోని బస్వాపూర్‌లో ఈనెల 5న డాక్టర్ బి.అర్.అంబేద్కర్ విగ్రహ అవిష్కరణ కార్యక్రమం నిర్వహించడ ం జరుగుతుందని మండల టిఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు వెల్పుల శంకర్ తెలిపారు. అదివారం అయన మాట్లాడుతూ డాక్టర్ బి.అర్.అంబేద్కర్ విగ్రహ అవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర అర్థిక, అరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, హుస్నాబాద్ ఎమ్మెల్యే ఒడితల సతీష్‌కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, అంబేద్కర్ యువజన సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## ఆత్మ కమిటీ డైరెక్టర్ భాస్కర్‌కు సత్కారం


ఆత్మ కమిటీ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**కొండపాక, డిసెంబర్ 4, ప్రభాతవార్త :** నూతనంగా నియామకమైన గజ్వేల్ డివిజన్ అత్మ కమిటీ డైరెక్టర్ సున్నం భాస్కర్ ముదిరాజ్‌ను మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్ మల్లమరి రవీందర్ అధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కుకునూర్‌పల్లి ఎఎస్ఐ సువర్ణ, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ హరీష్‌కుమార్, వార్డు సభ్యులు సాదుపల్లి కనకసేనగౌడ్, పాతకోటి లింగం, పంచాయతీ కార్యదర్శి మల్లారెడ్డి, నాయకులు తల్పేట్ల అండాలు, నర్సింహులు, కనకయ్య, బుచ్చవ్వ, నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక చికిత్స సహాయకుడికి పురస్కారం


ఎమ్మెల్యే చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న చంద్రం

**హుస్నాబాద్, డిసెంబరు 3,ప్రభాతవార్త :** పట్టణంలో కొద్ది సంవత్సరాలుగా ప్రాథమిక చికిత్స సహాయకుడిగా ప్రజలకు ప్రాథమిక చికిత్స అందిస్తూ మన్ననలు పొందిన మహంకాళి చంద్రం సేవలను గుర్తించిన తెలుగు వెలుగు సాహితి వేదిక స్వచ్చంద సేవా సంస్థ వారు ఆదివారం సంస్థ పదవ వార్శికోత్సవం సందర్బంగా వరంగల్‌లో వరంగల్ గ్రేటర్ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ చేతుల మీదుగా గౌరవ పురస్కారం అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ పోలోజు రాజ్‌కుమార్,జనగోని యాదగిరి,వేల్పుల రాజ్‌కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినిని సన్మానించిన టీ బేస్ నాయకులు

**జహీరాబాద్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** నీట్‌లో ప్రవేశం పొందిన బంజారా విద్యార్థిని స్వన్న రాఘోడ్‌ను టీబేస్ ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. టిబేస్ జహీరాబాద్ డివిజన్ అధ్యక్షులు తుకారామ్ చవాన్, ప్రధాన కార్యదర్శి హన్మంతు పవార్ అధ్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ఎస్‌బిఎస్ అధ్యక్షులు మోతిరామ్‌రాథోడ్, మీర్జంపల్లి, హెగ్గెల్లి తండాల సర్పంచ్‌లు గోపాల బానోత్, శెట్టి రాథోడ్, మాజీ సర్పంచ్ నారాయణ జాదవ్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీబేస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హీరాలాల్ చవాన్, రమేష్ బానోత్, నాయకులు ధల్‌సింగ్ రాథోడ్, పాండు పవార్, హీరాలాల్ పవార్, సిఆర్‌పి వేణుకుమార్, శంకర్, శానుబాయి, మోతీరామ్ చౌహ్వాన్, బంజారా నాయకులు రాజునాయక్ బానోత్, రవీందర్ చౌవాన్, శ్రీనివాస్ నాయక్ పవార్, పాండు, రమ్‌సింగ్, గౌసాబాద్ తండా సర్పంచ్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.


మెడిసిన్‌లో సీటు పొందిన విద్యార్థిని సన్మానిస్తున్న టీ బేస్ నాయకులు


మహిళా మోర్చా కమిటీని ఏర్పాటు చేస్తున్న బిజెపి నాయకులు

## బిజెపి గెలుపే లక్ష్యం : పోగుల రాజు

**మెదక్, డిసెంబర్ 4, ప్రభాతవార్త:** రాబోయే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బిజెపి మండల అధ్యక్షుడు పోగుల రాజు తెలిపారు. ఆదివారం చిన్నశంకరంపేట పట్టణంలో బిజెపి మహిళా మోర్చా కమిటిని ఏర్పాటు చేయగా మండల అధ్యక్షురాలుగా మంజుల, ప్రధాన కార్యదర్శిగా కర్రోళ్ల శివలక్ష్మీ, ఉపాధ్యక్షులుగా ప్రమీల, బాలమణి, రాజవ్వ, కార్యదర్శులుగా, సుజాత, రజిత, శంకరమ్మలను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు దశరథం, భూపాల్, వనం నర్సింలు, శ్రీనివాస్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పట్టుదలతో ఉద్యోగం సాధించాలి : ఎస్ఐ

**మెదక్, డిసెంబర్ 4, ప్రభాతవార్త:** పట్టుదలతో కష్టపడి శ్రమిస్తే విజయం మీదేనని చిన్నశంకరంపేట ఎస్ఐ సుభాష్‌గౌడ్ పోలీసు ఉద్యోగాల శారీరక పరీక్షలకు సిద్దమవుతున్న అభ్యర్థులకు సూచించారు. ఆదివారం చిన్నశంకరంపేటలోని ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో వ్యాయామం చేస్తున్న అభ్యర్థులతో మాట్లాడి కావలసిన సలహాలు, సూచనలు ఇచ్చారు. పోలీసు ఉద్యోగం అంటే కత్తిమిద సాములాంటిదని, అది సాధించాలంటే కష్టపడి చదవాలని, ఉదయం సాయంత్రం వేళలలో వ్యాయామం, రన్నింగ్ చేయాలన్నారు. అభ్యర్థులకు ఎలాంటి సందేహాలు ఉన్న తనను ఎప్పుడైన సంప్రదించవచ్చని తెలిపారు. లాంగ్‌జంప్ ప్రాక్టిస్ చేయడానికి అవసరమైన ఇసుక ను అందించాలని అభ్యర్థులు కోరగా వెంటనే ఇసుకను తెప్పించాడు. అలాగే షార్ట్ పుట్ సామాగ్రిని సొంత ఖర్చులతో ఇప్పిస్తానని వారికి తెలిపారు.

## అయ్యప్ప స్వామి దేవాలయంలో ఘనంగా మహా పడిపూజ


మహా పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**మెదక్ మున్సి పాలిటీ, డిసెంబర్ 4 ప్రభాతవార్త:** పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆదివారం హరిదాస్ గురుస్వామి, రాజు పంతులు గురుస్వామి ఆధ్వర్యంలో మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు భక్తులు పాల్గొన్నారు. అయ్యప్ప స్వామికి పూజలు, అభిషేకాలు చేశారు. భజన కార్యక్రమంలో భక్తులు, స్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ చంద్రపాల్, వైస్ ఛైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బట్టి జగపతి, ఏలూరు శేఖర్, వేణు, నరేందర్, శ్రీనివాస్, లక్ష్మీపతి, భువన్‌కుమార్, రమణపురం వెంకటరమణ, రాజన్, రామాంజనేయులు, శ్రీకాంత్, జనార్ధన్‌రెడ్డి, స్వాములు పాల్గొన్నారు.

**శివ్వంపేటలో...**

**శివ్వంపేట, డిసెంబర్4 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఆదివారం అయ్యప్పస్వామి పడిపూజ వైభవంగా జరిగింది. శివ్వంపేటకు చెందిన జె. నవీన్ కన్నెస్వామి నివాసంలో పడిపూజను ఘనంగా నిర్వహించారు. గణపతి, సుబ్రహమణ్య స్వామి పూజలతో పాటు పలు రకాల పండ్లు, పూలు, అభిషేకం, పంచామృతంతో శ్రీ అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. వైభవంగా అలంకరించిన పద్దెనిమిది మెట్ల పడిని నవీన్ కన్నె స్వామి పాటలు, భజనలతో వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. పడిపూజ మహోత్సవానికి చుట్టు ప్రక్కల ప్రాంతాల అయ్యప్ప స్వామి భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. చెన్నాపూర్ గ్రామ భజన మండలి సభ్యులు పాడిన కీర్తనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదాన వితరణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఇసుగారి మల్లేష్ గురుస్వామి, నర్సారెడ్డి గురుస్వామి, బోళ్ల భిక్షపతి గురుస్వామి, ఇసుగారి అరుణ్ గురుస్వామి, ఇసుగారి రాము గురుస్వామి, వజ్జ శ్రీనివాస్ గురుస్వామి, కె. సత్యనారాయణగౌడ్ గురుస్వామి, క్యాసని వెంకటేష్ గురుస్వామి, కృష్ణాగౌడ్ గురుస్వామితో పాటు స్థానిక సర్పంచి పి. శ్రీనివాస్‌గౌడ్, ఉప సర్పంచి రాజీపేట పద్మా వెంకటేష్, నాయకులు వంజరి కొండల్, గౌరిశంకర్, పంబాల విఠల్, మియ్యడి సింహం తదితరులు పాల్గొన్నారు.

## పేదల సేవకే హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్

**ఝరాసంగం, డిసెంబరు 4, ప్రభాతవార్త:** పేదల సేవకే హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ కృషి చేస్తోందని ఎల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఛైర్మన్ మొరంగిపల్లి జైపాల్ అన్నారు. ఆదివారం ఝరాసంగంతో పాటు మండలంలోని కొల్లూర్, వనంపల్లి గ్రామాల్లో పర్యటించి విలేఖరులతో మాట్లాడారు. చలికి వణుకుతున్న నిరుపేదలకు దుప్పట్లను పంపిణి చేసే కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. ఆరోగ్యం కోసం పేదలకు అవసరమైన మందులను పంపిణి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మండల అధ్యక్షులు ఆర్ నర్సింలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న జాతరలో పూజలు నిర్వహించన ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, డిసెంబర్ 4 ప్రభాతవార్త:** మండలపరిధిలోని సంజీవన్ రావుపేట, అనంతసాగర్ గ్రామంలో నిర్వహించిన మల్లన్న జాతరలో ఆదివారం ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మల్లన్న దేవాలయంలో పూజలు నిర్వహించారు. గ్రామస్థులు ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులు ఎమ్మెల్యేకు శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంజీవన్‌రావుపేట సర్పంచ్ ఎంబటి విఠల్, జడ్పీటీసీ లక్షిబాయి రవీందర్‌నాయక్, ఎంపీపీ తనయుడు రమేష్‌చౌహాన్, మండల పార్టీ ఉపాధ్యక్షులు నర్సింలు, కురుమ నాయకులు, సర్పంచ్ రాజు, సత్యగామ సర్పంచ్ వెంకటేశం, ఉప సర్పంచ్ సిద్దు, నాయకులు బస్వరాజ్, గ్రామ పెద్దలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


మల్లన్న దేవాలయంలో పూజలు చేసిత భూపాల్‌రెడ్డి తదితరులు

## రోడ్డు ప్రమాదంలో పూజారి మృతి

**ములుగు, డిసెంబర్ 4 (ప్రభాతవార్త):** కల్వర్టును బైక్ ఢీకొని యువకుడు (పూజారి) మృతిచెందిన సంఘటన ములుగు మండలం తునికిబొల్లారం గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఆదిలాబాద్ జిల్లా కుంటల గ్రామానికి చెందిన మణికంఠ(20) మేడ్చల్ జిల్లా రావణ్‌కోల్ గ్రామంలోని శివాలయంలో పూజారిగా, గ్రామంలో పురోహితం చేస్తున్నాడు. కాగా ఆదివారం ఉదయం సిద్దిపేటలో పెళ్ళికి హాజరవడానికి రావణ్‌కోల్ నుంచి బైక్‌పై వెళ్తున్న క్రమంలో ములుగు మండలం తునికిబొల్లారం సమీపంలోకి చేరుకోగానే రోడ్డు పక్కన ఉన్న కల్వర్టుకు అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందినట్లు ములుగు ఎస్ఐ రంగా కృష్ణ తెలిపారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

